ఉద్యోగంలో చేరిన మొదటిరోజు చాలా ఆహ్లాదకరంగా గడిచింది. కంపెనీలో తనతోపాటు మరో ఇద్దరు తన క్లాస్‌మేట్స్ కూడా చేరారు. కుర్చీలో కూర్చునే ముందు ప్రిన్సిపాల్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. నిబద్ధత, వర్క్-లైఫ్ బ్యాలెన్స్ అన్న పదాలు వల్లె వేసుకుంది.

అప్పుడే కంపెనీలో సీనియర్ మేనేజర్ వచ్చి తనను తాను పరిచయం చేసుకుని..

''ఏకాగ్రతతో.. నిబద్ధతతో పనిచెయ్యండి. ఎంత నిబద్ధతగా ఉంటారో అంత ప్రతిఫలం కూడా ఉంటుంది. యువర్ ప్యాకేజ్ అండ్ పెరక్స్ విల్ బీ డైరెక్ట్‌లీ ప్రపోర్షనల్ టు యువర్ సిన్సియారిటీ!'' అని విష్ చేసి వెళ్లిపోయాడు.

ఒక నెల తరువాత.. అప్పుడు గమనించింది శ్రీవల్లి. ఇంకా చాలామంది వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలోనే పని చేస్తున్నారు. యాజమాన్యం ఇప్పటికే పలుమార్లు ఆఫీసుకు రావాలని చెప్పినా.. వచ్చేందుకు సుముఖంగా లేరు. ఏదో కారణం చెప్పి ఇంటినుంచే పని చేస్తున్నారు. ముఖ్యంగా చాలామంది.. 'హెల్త్ రీజన్!' అంటూ ఇంట్లోనే ఉంటున్నారు.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.

శ్రీవల్లికి ఆ పరిస్థితి అర్థం చేసుకునేందుకు మరికొంత సమయం పట్టింది. అయినా ఎందుకో వాళ్ల పద్ధతి సరి అనిపించలేదు ఆమెకు. అదే విషయం తన సీనియర్ సుజాతను అడిగింది.

''ఏంటండీ.. ఎవరూ ఆఫీస్‌కు రావడం లేదు. లాక్‌డౌన్‌కు ముందు అంతా సక్రమంగానే వచ్చేవాళ్లు కదా. మరి ఇప్పుడెందుకు రారు?''.

సుజాత నవ్వేసి..

''నువ్వింకా కొత్త కదా. అలాగే ఉంటుంది. ఒక్క ఆరు నెలలు పనిచేస్తే.. ఈ సిన్సియారిటీ, డెడికేషన్ ఇవన్నీ గాలికి కొట్టుకుపోతాయి. ఇక్కడ ఎక్స్‌ప్లాయిటేషన్ ఎక్కువగా ఉంటుంది. నువ్వు పనిచేస్తున్నావని నిన్ను నెత్తిన పెట్టుకోరు. నీకు మరింతగా పని ఇస్తారంతే! మనం ఏం పని చేస్తున్నామో, ఎంత పని చేస్తున్నామో ఈ మేనేజర్లకు తెలుసనుకుంటున్నావా? అలా తెలిసినవాళ్లు చాలా కొద్దిమంది మాత్రమే. మేనేజర్ అంటే ఫర్ మేనేజింగ్, నాట్ ఫర్ వర్కింగ్! 'మై జాబ్ ఈజ్ టు మేక్ యూ వర్క్!' అంటారు. మనకు తెలియని పని గురించి అడిగినా చాలామంది చెప్పలేరు. మనల్నే తెలుసుకుని చెయ్యమంటారు. 'నువ్వేం చేస్తావో ఎలా చేస్తావో నాకు తెలీదు. ఐ వాంట్ ద వర్క్ టు బి కంప్లీటెడ్ టుడే' అనే ఒక్కమాట మాత్రం తెలుసు వాళ్లకు'' అంటూ ఒక పెద్ద లెక్చరిచ్చింది.

ఎందుకో ఆమె మాటలు నచ్చలేదు శ్రీవల్లికి. తానడిగిన ప్రశ్నకు ఆమె చెప్పిన జవాబుకు పొంతన కుదరలేదు.

'లాక్‌డౌన్‌కు ముందు సక్రమంగా వచ్చేవాళ్లు ఇప్పుడెందుకు రావడం లేదని అడిగితే ఏదేదో మాట్లాడిందేమిటీ. మనం పని చేసేందుకే వచ్చాం. ఇక్కడున్న ఆ ఎనిమిది గంటలు మనస్సాక్షికి కట్టుబడి పనిచెయ్యాలి. అంతే!' అని తనకు తానే సర్ది చెప్పుకొన్నది.

* * *

మొదటి నెల జీతం తీసుకున్న సంతోషం శ్రీవల్లికి మాటల్లో చెప్పలేనిది.

'రుపీస్ సిక్స్టీ థౌజెండ్ క్రెడిటెడ్ టు అకౌంట్ నం....' అంటూ మెసేజ్ చూసుకోగానే సాయంత్రం ఎప్పుడెప్పుడు ఇంటికివెళ్లి ఆ డబ్బు మొత్తాన్ని తండ్రి అకౌంట్‌కు బదిలీ చేస్తానా!? అంటూ ఆతృతగా ఎదురు చూసింది. అంతకన్నా ముందుగానే తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పేసింది. ఇంటికి వెళ్లీ వెళ్లగానే తండ్రి అకౌంట్ నంబర్ తీసుకుని వెంటనే మొత్తం జీతాన్ని బదిలీ చేసేసింది.

''అదేంటమ్మా! మొత్తం పంపించేస్తే.. మరి నీ ఖర్చులకు?''.

''ఇప్పుడు నీకుగా నువ్వు ఎంత తోస్తే అంత నా అకౌంట్ కు ట్రాన్స్‌ఫర్ చెయ్ నాన్నా. ఉన్నదాంట్లోనే సర్దుకుంటాను''.

చక్రవర్తి కళ్లు ఆనందబాష్పాలు రాల్చాయి.

''నా బంగారు తల్లివమ్మా! ఉన్నదాంట్లో తృప్తిపడాలని నేను నిన్నెప్పుడూ దేనికీ నిర్బంధించ లేదే? ఎక్కడ నేర్చుకున్నావు?''.

''నువ్వు చెప్పలేదు కానీ.. నిన్ను చూసి నేర్చుకున్నాను నాన్నా.. అయామ్ హ్యాపీ నౌ!''.

* * *

మరొక నెల గడిచాక ఒకరోజు హఠాత్తుగా కంపెనీలో కలకలం బయల్దేరింది. కంపెనీలో పనిచేసే సుమారు పాతికమందిని తీసేశారు.

ఏమైందని ఆరా తీస్తే.. అదేదో 'మూన్ లైటింగ్' అని